అభూతకల్పన

# కళాపోషకుడు

## కొడవటిగంటి కుటుంబరావు

కళాదేవత మరొకసారి భర్తకోసం వెతకసాగింది.

ఒకప్పుడామెకు ఒక నిర్ణీతమయిన భర్త లేడు. ఆమె అందరితోటీ కలిసి జీవించింది. అందరితోనూ సహజీవనం సాగినంతకాలమూ ఆమె జీవితం సహజంగా నడిచింది. ఆ తరవాత ఆమెకు కష్టాలు ఏర్పడ్డాయి.

పరిస్థితులు మారిపోతున్నాయి. అందరూ కలిసి యజ్ఞకర్మ చేసిన రోజులు పోయాయి; కొందరు యజ్ఞం చేసేవారూ, కొందరు చేయించేవారూ అయారు. కర్తలూ భోక్తలూ వేరయారు. ఎక్కువా తక్కువా ఏర్పడింది. కొందరి జీవితాలు పెరుగుతున్నాయి, అధిక సంఖ్యాకుల జీవితాలు తరుగుతున్నాయి.

కళాదేవతకు సహజంగా పెరిగే జీవితంపైనే అభిమానం. ఆవిడ అలాటి జీవితాలుగలవారిని భర్తలుగా స్వీకరించింది.

కాని - ఇంగువ కట్టిన గుడ్డ! - అందరితోనూ సహజీవనం చేసే ప్రేరణ ఆమెలో అంతరించలేదు. ఆ ప్రేరణను అణుచుకుంటేగాని ఆమె తన భర్తలతో జీవించలేకపోయింది.

అయితే కళాదేవత త్వరలోనే ఒక వింత విషయం గమనించింది. ఆమెను భరించేవారికి ఆమెపై నిజమైన ఆదరణ లేదు. ఆమె వారి బానిసలలో ఒక బానిస! ఆమె అంతకంటే హెచ్చు హోదా ప్రకటించినప్పుడల్లా వాళ్ళు కన్నెర్ర చేశారు. ఇంకొక వింత ఏమిటంటే, హీనమానవులయిన బానిసలు కళాదేవతపై చాలా ఆదరం చూపారు; తమకష్టాలను ఆవిడద్వారా ప్రపంచానికి వ్యక్తంచెయ్యటానికి తపస్సు సాగించారు. వారి తపస్సు ఆమెను ముగ్ధురాలిని చేసింది. ఆమె వారివైపు వెళ్ళిపోయింది.

వెంటనే ఆమె భర్తలు ఆమెపై దుమ్ము చల్లారు:

"అదేమి చిత్రమో ఈ కళ మనను కాదని బానిసలను వరిస్తున్నది." అన్నారు కొందరు.

"కళ పతనమైంది. జీవితంలో ఆ నికృష్టుల బాధలు తప్ప ఇంకేమీ లేవా?" అన్నారు మిగిలినవాళ్ళు.

వాళ్ళు కళపై అలిగి ఆమెను ఉపేక్షించారు. వారి పతనం ప్రారంభమయింది.

మళ్ళీ రోజులు మారాయి... రాజులు వచ్చారు. కళాదేవతకు తాళి కట్టారు; అసంఖ్యాకంగా ఉన్న తమ ఉంపుడు కత్తెలమధ్య పెట్టేశారు. ఆకస్మికంగా ఒక నాడు కళాదేవత రాజసౌధాల పహారా

వాళ్ళను తప్పించుకుని తనకోసం అలమటించే సామాన్య ప్రజలను చేరుకున్నది.

ధనికవర్గం వాళ్ళు వచ్చారు. కళాదేవతను దగ్గిరికితీసి ఆదరించారు. వారికోసం ఆవిడ అచ్చాఫీసులలో, సినిమా స్టూడియోలలో, రేడియో స్టేషన్లలో, డ్రామా నాటక కంపెనీల రిహార్సల్ రూములలో ఇంకా అనేకచోట్ల శ్రమించింది.

ఈ సారి కళాదేవతకు కలిగిన కొత్త అనుభవాలు యేమంటే, ఈ కళాభక్తులు ఆమెను ప్రజలకు దూరంగా ఉంచటం లేదు. పై పెచ్చు ఆమెను ప్రజలపైన ప్రయోగిస్తున్నారు.

"నా భక్తులకు నా పైన ఆదరంగాని ప్రేమగాని లేదుసరే గదా, వీళ్ళు నన్ను ప్రజలకు తార్చుతున్నారు, డబ్బు చేసుకుంటున్నారు. నావల్ల తాత్కాలికంగా చవుకబారు ఆనందం పొందటం తప్ప ప్రజలు నానుంచి ఏ మేలూ పొందటం లేదు" అనుకున్నది కళాదేవత.

## 2

కళలను పోషించటానికి ఒక కొత్త వ్యక్తి అవతరించాడు. ఈ కళాభక్త కోటీశ్వరుడు. పూర్వం కళలను ఆదరించిన రాజులలో ఇంతకంటె ధనికులు లేరు. ఈయన ఇల్లు ఆకాశమంత ఎత్తు. ఈయనకు సొంత విమానా లున్నాయి. కార్లున్నాయి. ఒక సొంత రైలుబండి కూడా ఉన్నది. ఈయన పెట్రోలు ఖర్చుతో కొన్ని వేలమందికి అన్న వస్త్రాలు వస్తాయని అంచనావేశారు.

తాంబూలంలో వేసుకునే పొగాకు పొట్లాలమ్మి ఈయన లక్షాధికారి అయాడు; ఆ లక్షలు పెట్టుబడిచేసి పబ్లిసిటీసంస్థలు పెట్టి కోటీశ్వ రేశ్వరుడయాడు. అదీ సంగ్రహంగా ఆయన చరిత్ర.

ఆయన పొగాకు పొట్లాల కథ పదిహేడు భాషలలోకి అనువాదమయింది. "ఆయన పొగాకులో నిజమైన పొగాకు ఎంత? అందులో ఆయన ఏమేమి చేర్చాడు?" ఇత్యాది వైజ్ఞానిక సమస్యలను గురించి ఎంతోమంది మేధావులు పత్రికలలో వాదోపవాదాలు జరిపారు.

అది పేటెంటు పుగాకు. దానికన్న మంచిపొగాకుపొట్లాలు చాలా తయారైనాయి. కాని ఒకటీ ఎక్కి రాలేదు. ఆయన తన పోటీదార్లందరనీ రకరకాలుగా నిర్మూలించాడు. తన పుగాకుతో పోటీచేస్తున్న ఒక పుగాకులో నాభి ఉన్నదని పుకారు లేవదీయటానికిగాను యాభై వేలరూపాయలు ఖర్చుచేసి మనుషులను పెట్టాడు. మరొక పోటీదారు తయారుచేసి తనకన్నా చవుకగా విక్రయిస్తున్న పొగాకు పొట్లాలను తన ఏజెంట్లద్వారా కొనిపించేసి మార్కెటులోకి రాకుండా చేసేశాడు. ఇంకొక పోటీదారు వ్యాపారాన్ని కొట్టింపుధరకు కొనేవాడు. ఆయన లీలలు చాలా ఉన్నాయి.

కానీ పుగాకు పొట్లంమీద ఈ పెద్దమనిషి లక్షలు ఎట్లా గడించాడు. (ఇటీవల పొట్లం ఖరీదు రెండు నయాపైసలకు పెరిగింది. ఈ పెరుగుదలవల్ల ఆయనకు ఎన్ని లక్షలు అదనంగా వస్తుందో అంచనా వేశారు.)

ఆయన పొగాకులో విశేషం ఏమీ లేదు - అందులో పొగాకు దాదాపు

ఏమీ లేకపోవటంతప్ప. అలాటప్పుడు దానితో లక్షాధికారి ఎట్లాఅయాడు? తన ఆత్మకథలో ఆయన ఈ విధంగా రాసుకున్నాడు:

"ప్రపంచంలో నూటికి ముప్పై ఆరుగురు రోజూ కాఫీ తాగుతారు కాఫీ పరిశ్రమ పెద్ద పరిశ్రమ. ఈ పరిశ్రమ ఎలా ప్రారంభమయింది? చాలామంది ప్రజలు తమకు కాఫీ కావాలి అని నిర్ణయించుకోవటంవల్ల కాఫీ పానీయం సృష్టి కాలేదు. కాఫీవిత్తుల సారంనుంచి పానీయం తయారుచేసే పద్ధతి ఎవరో కనిపెట్టారు. ప్రచారం మూలంగా ఆ కాఫీ జనానికి పాకింది. ముఖ్యమైనది ప్రచారం - జనానికి పట్టే ప్రచారం. సరిఅయిన ప్రచారం జరిగితే ఎంతమంది చేతనైనా పొగాకు నమిలించవచ్చు. కేవలం ప్రచారంయొక్క ఉత్కృష్టత మూలంగానే నేను రోజూ రెండు కోట్ల ప్రజలచేత నా పొగాకు నమిలిస్తున్నాను..."

ఈయన పొగాకు ప్రచారం ఎంత కొత్త పద్ధతులమీద, ఎంత విజయవంతంగా నడిచిందంటే, అదే పద్ధతులలో ఇతర వ్యాపార సరకులను ప్రచారం చెయ్యటానికి ఈయన దేశమంతటా సంస్థలను ఏర్పాటు చేశాడు.

"ప్రచారం కనబడితే చాలదు. వినపడాలి!" అని ఆయన నినాదం. ఇందుకుగాను ఆయన ఒక అమెరికన్ ఇంజనీరుచేత ఒకరకం యంత్రం తయారు చేయించాడు. ఈ యంత్రం చిన్న ట్రంకు పెట్టె ప్రమాణంలో ఉంటుంది. ఇందులో ఒక మాగ్నెటిక్ టేపూ, లౌడ్‌స్పీకరూ ఉంటాయి. ఈ టేపు రెండు గంటలసేపు ఆడుతుంది. దానిపైన రకరకాల వ్యాపార సరుకులను ప్రచారం చేసేపాటలు రికార్డు చేసి ఉంటాయి. టేపు "లూప్" చేసి ఉండటంవల్ల ఎన్నిరోజులపాటైనా మళ్లీమళ్లీ నడుస్తూ ఉంటుంది.

అన్ని దేశాలలోనూ పేటెంట్లు పొందిన ఈ పెట్టెలకు "నగలపెట్టెలు" అని ముద్దుపేరు పెట్టారు. ప్రపంచంలో ఉన్న అన్ని ముఖ్యనగరాలలోనూ, పెద్ద పెద్ద చౌకలలోనూ, పార్కులలోనూ ఈ పెట్టెలు ఏర్పాటయాయి. వీటిని పెట్టుకోనిచ్చినందుకు కోటీశ్వరుడు మునిసిపాలిటీలకు కళ్ళు తిరిగిపోయే మొత్తాలు చెల్లించాడు.

ఈ పెట్టెలను పత్రికలు కొన్ని తీవ్రంగా విమర్శించాయి. కొందరు పార్లమెంటులలో ప్రశ్నలు వేశారు. కాని వాటివల్ల అపకారం ఉందని ఎవరూ రుజువు చెయ్యలేక పోయారు.

"నాకు రాజకీయాలతో నిమిత్తంలేదు. నేను కేవలం పబ్లిసిటీ చేస్తున్నాను. నా చార్జీలు చాలా హెచ్చు. అందుచేత ఘరానా వ్యాపారస్తుడు కానివాడు నాకు కట్టసుసు కాలేడు... 1400 పైచిలుకు భాషలలోనా "నానగల పెట్టెలు" ప్రకటనలను చెబుతున్నాయి. లిపి కూడా లేని 29 భాషలలో నేను పబ్లిసిటీ జరుపుతున్నాను... నేను కళాసేవ కూడా చేస్తున్నాను. ప్రపంచ ఖ్యాతిగల అనేకమంది కవులూ, సంగీతవేత్తలూ నాపోషణలో ఉన్నారు... నా పబ్లిసిటీ పాటలు నిత్యమూ ఎన్నికోట్లమంది పాడి ఆనందిస్తారో ఎవరూ చెప్పలేకుండా

ఉన్నారు." అని ఆయన ఒక యునెస్కో ప్రతినిధితో అన్నాడు.

## 3

"ఓహో, సంగీత సరస్వతి గారా? దయచెయ్యండి" అన్నాడు మూడో డిగ్రీ ఎయిర్ కండిషన్ గదిలో కూచుని ఉండిన కోటీశ్వరుడు.

మొదటి డిగ్రీ ఎయిర్ కండిషన్ గదిలో ఒక అరగంటా, రెండో డిగ్రీ గదిలో ఇంకో అరగంటా వేచి వుండిన సంగీత సరస్వతికి ఈ కోటీశ్వరుడి ఆప్యాయత ఆటే అనలేదు.

"మీరు పిలవగా వచ్చినవాడికే తమ దర్శనం కావటం ఇంత దుర్లభమైంది గదా, నా పనిమీద వచ్చి ఉంటే ఏం కాను?" అన్నాడాయన.

తనకేదో పెద్ద పెద్ద బిరుదు ప్రదానం జరిగినట్టుగా నవ్వి కోటీశ్వరుడు, "ఇది మన ఇద్దరి పనీనూ! మీ చేత కొన్ని పబ్లిసిటీ పాటలు రాయించుకుందామనే ఉద్దేశంతో పిలిచాను. ఇది చాలా గొప్ప గౌరవమని మీకు తెలిసే వుంటుంది!" అన్నాడు కోటీశ్వరుడు.

"మీ పబ్లిసిటీ పాటలు అనేకం ప్రతి వీధిమూలా వింటున్నాను. వాటిని ఎవరు రాసినా సరిపోతుందే?" అన్నాడు సంగీత సరస్వతి.

"పబ్లిసిటీ మర్మం అక్కడే వున్నది. మీకు గొప్ప పేరున్నది. మీరు పబ్లిసిటీ పాట రాశారంటే ఆ పాటకు ఎంత పబ్లిసిటీ అయినా ఉంటుంది. దానితో బాటు మీకూనూ!...మీకు గిట్టుబాటు అయేటట్టు చూస్తాను. సాధారణంగా సినిమా కంపెనీలవాళ్ళిచ్చేదానికి - పదింత లిస్తాను. పన్నెండు పాటలకు ఇప్పుడే కంట్రాక్టు రాస్తాను. సగం మొత్తం ఎడ్వాన్సుగా ఇస్తాను!" అన్నాడు కోటీశ్వరుడు.

సంగీత సరస్వతి ప్రాణం దిమ్మరపోయింది. "ఇందులో ఏదో కిటుకున్నది. నేను అడుక్కు తింటున్న రోజుల్లో రాసిన పాటలు కృతులు తక్కువ కావన్నారు. పేరు వచ్చింది, డబ్బు లేదు. ఆ పేరును సినిమా కంపెనీల వాళ్ళు డబ్బుగా మార్చారు. ఈ మధ్య మా గురువుగారు కనిపించి, 'నీ సినిమా పాటలు వింటున్నానోయ్!' అంటే ప్రాణం చచ్చినట్టయింది. "ఈ పెద్దమనిషి ఇంకా ఇస్తానంటున్నాడే! నా పెళ్ళాం బిడ్డల అదృష్టం!" అనుకున్నాడాయన.

సంతకాలయిపోయాయి. చెక్కు చేతులు మారింది. ఒకపాట—నాలుగు పంక్తులవి— ఆయన చేతికిచ్చి సెల లోపుగా స్వరపరచామన్నారు. రెండు నిమిషాలలో సంగీతసరస్వతి దానికి ఆరురకాలగా స్వరం తయారుచేశాడు.

కోటీశ్వరుడు శ్రద్ధగా ఆరుపద్ధతులూ విని తల అడ్డంగా తిప్పాడు.

"ఇది పబ్లిసిటీ పాట! ప్రతి నాలుగేళ్ళ కుర్రవాడూ దాన్ని పాడకుండా ఉండలేకపోవాలి. అప్పుడు గాని ప్రకటనదార్లు నాకిచ్చే సొమ్ము గిట్టుబాటు కాదు. మేరే మాలా బులాలో పాట తెలుసుగా? సరిగా అలాగే దీన్నికూడా పాడండి. సరిపోతుంది" అన్నాడు కోటీశ్వరుడు.

(మిగతా 1÷ వ పేజీలో)

నీ కాంతి వెలుగొందునా
నా కనుల బాష్పాలె
వాకలై ప్రవహించ
ఆ నీటిలో మునిగి
అవలిదరి జేరెదను
చేయూత నా కిత్తువా
ధీరుడా
దుఃఖభారము దింతువా
ఓనీలి మేఘమా
ఓ చిన్ని తారకా
చంద్రబింబపు జాడ
లేమైనా తెలిసినా

ఆ జాడ తెలిసినా
ఆ మోము కాంచినా
జాడ తెలిపి పోవుడీ !
నా తోడ,
మాట పలికిపోవుడీ !
కరకు కత్తులబోను
కల్యాణమంటపము
నీ దరికి రానీక
అడ్డుగా నిలిచింది
నన్ను మన్నింపు మా
చంద్రుడా
నా తప్పు సైరింపుమా !

★

---

(12 వ పేజీ తరువాయి)

ఆయన కోరినప్రకారం పబ్లిసిటీ పాట పాడుతూ సంగీతసరస్వతి కొత్త పెళ్ళి కూతురికన్నాకూడా ఎక్కువగా బిడియ పడ్డాడు.

"అంతే! అద్భుతంగా వుంది!" అన్నాడు కోటీశ్వరుడు.

సంగీతసరస్వతి ఇంటికి వచ్చేస్తూ తనను తాను గట్టిగా గిల్లుకున్నాడు. చచ్చేబాధ కలిగింది!

ఆరోజు సాయంకాలం సాహిత్య సరస్వతికూడా కోటీశ్వరుడిదగ్గిర చెక్కు పుచ్చుకుని ఇంటికి తిరిగివస్తూ అలాగే తనను తాను గిల్లుకుని బాధపడ్డాడు....

